క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



నర్సంపేట రూరల్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. నర్సంపేట మండలంలోని రాజుపేటలోని రైతు వేదికలో 'ధర్తీ ఆబా జన భాగీదారీ అభియాన్' సభ మంగళవారం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. అర్హులకు ఆయుష్మాన్ భవ స్కీమ్, టీబీ ముక్త భారత్, పీఎం మాతృవందన పథకాల్లో గిరిజనులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సమావేశంలో భాంజీపేట మెడికల్ ఆఫీసర్ అరుణ్ చంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ, ఆర్ఐ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

'లబ్ధి కోసమే రైతుభరోసా'

నర్సంపేట : ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే రైతుభరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి రూ.12 వేలకు పరిమితం చేయడంతోపాటు గత వానాకాలం, యాసంగిలో రైతుభరోసా ఎగ్గొట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసి విజయోత్సవాల పేరిట సంబరాలు జరుపుకోవడం రైతులను మోసగించడమేనని తెలిపారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని నమ్మించే సన్నాలకే పరిమితం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల బతుకులు సంక్షోభంలో కూరుకుపోయాయని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా రైతులకు ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం'

పర్వతగిరి : రైతు సంక్షేమం కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రోజుల్లో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో 9 వేల కోట్ల రూపాయలు జమ చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షమని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు, మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆట వస్తువుల అందజేత



వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి హైస్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేల విలువైన ఆట వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ మాజీ డీసీటీ కృష్ణారెడ్డి మాట్లాడారు. ఆటలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని తెలిపారు. గతేడాది క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుకుమార్, క్లబ్ మాజీ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, బాధ్యులు సుదర్శన్‌రెడ్డి, సునీల్, నర్సయ్య, సతీశ్, ప్రభాకర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గువ్వలబోడు రైతులకు భరోసా కల్పించాలి

వర్ధన్నపేట : మండలంలోని గువ్వలబోడు భూముల్లో సుమారు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న రైతులకు భరోసా కల్పించాలని అంబేడ్కరిజం బాధ్యులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. భూములు కోల్పోతున్న దళితుల స్థితిగతులను గుర్తించి ఇతరుల ప్రమేయం లేకుండా, ఎవరికీ నష్టం వాటిల్లకుండా రైతులకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు.

ఆర్థికసాయం



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన అన్నెబోయిన శ్రీను ఉపేంద్ర దంపతుల రెండో కుమారుడు చందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి మంగళవారం రూ.7500 సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు అన్నెబోయిన అనిల్, వినోద్, సాదబోయిన రాజు, బండారు కుమారస్వామి, ఎదురబోయిన అశోక్, ఉప్పరి ప్రవీణ్, ఉప్పరి వీరస్వామి, కొమురయ్య, ఎర్ర వెంకన్న, చిన్నస్వామి, అనిల్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి ప్రజాదరణ

- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- ప్రైవేట్ నుంచి చేరిక

దుగ్గొండి : ఊరి (సర్కారు) బడి.. విద్యార్థులకు సరస్వతి ఒడి.. పల్లె విలువ పెంచుతున్న చదువుల తల్లి.. కొంత కాలంగా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల సంఖ్య తగ్గి కునారిల్లుతుండడం తెలిసిందే. అలాగే ప్రభుత్వ పాఠశాలలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం, ప్రభుత్వం కార్పొరేట్ తరహా సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలతోపాటు బడిబాటలో విద్యార్థుల భవిష్యత్తుపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు కల్పించిన భరోసాతో మండలంలో ప్రభుత్వ స్కూళ్లకు ప్రజాదరణ పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి.

మండల పరిధిలో 7 హైస్కూళ్లు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, 22 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. గతేడాది అన్ని స్కూళ్లలో కలిసి మొత్తం 1005 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 170 మంది పదో తరగతి విద్యార్థులు. పదో తరగతి విద్యార్థులు కళాశాలకు వెళ్లగా మండలంలోని స్కూళ్లలో పాత విద్యార్థుల సంఖ్య 835కు చేరింది. బడిబాట, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఉపాధ్యాయుల ప్రచారంతో ప్రవేశాలు పెరిగాయి. ప్రస్తుత విద్యాసంవత్సరం ఇప్పటికే మండలంలోని ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్య 1351కి చేరింది. అంటే గతేడాదితో పోల్చితే అదనంగా 516 మంది విద్యార్థులు చేరిన విషయం ప్రస్ఫుటమవుతోంది. మొదటి తరగతిలోనే గడిచిన వారం రోజుల స్కూల్ పని దినాల్లో 131 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. సర్కారు బడులపై ప్రజాదరణకు ఇది అద్దం పడుతోంది.



నాచినపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న టీచర్లు (ఫైల్)

నాచినపల్లి ప్రైమరీ స్కూల్‌లో..

మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతేడాది 6 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఇప్పటికే విద్యార్థుల సంఖ్య 40కి చేరింది. ఈ స్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు తరగతులు బోధిస్తుండగా బోధనా విధానంలో మార్పులు, డిజిటల్ తరగతి గదులతో మెరుగైన విద్యాబోధన అందుతుండడంతోపాటు ఉపాధ్యాయుల బడిబాటతో విద్యార్థుల చేరికలు పెరిగాయి. హెచ్‌ఎం గంగాధర్ పాఠశాల పూర్వ విద్యార్థులను భాగస్వాములను చేస్తుండడం సత్ఫలితాలిస్తోందని చెప్పక తప్పదు.

దేశాయిపల్లి ప్రైమరీ స్కూల్‌లో..

మండలంలోని దేశాయిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గతేడాది 7 తరగతుల్లో 40 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది బడిబాట కార్యక్రమ నిర్వహణతో కొత్తగా మరో 20 మంది విద్యార్థులు చేరగా సంఖ్య 60కి పెరిగింది. మరింత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందని తెలుస్తోంది.



దేశాయిపల్లిలో ఒకటో తరగతి విద్యార్థులతో టీచర్లు

నాణ్యమైన విద్యపై నమ్మకం



ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగింది. అనేక సదుపాయాలు ఉన్న సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించాలన్న భావన గ్రామీణుల్లో మొదలైంది. పూర్వ విద్యార్థులు, యువత స్కూళ్లలో చేరిక విషయంలో చొరవ చూపిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం పెరుగుతుంది.

– వెంకటేశ్వర్లు, ఎంఈఓ

రైతుభరోసా సంబరాలు



వర్ధన్నపేట : సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా నిధులు విడుదల చేయడంపై జిల్లాలోని వర్ధన్నపేట, నెక్కొండ, సంగెం, గీసుకొండ, తదితర మండలాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీలకు వర్ధన్నపేట, సంగెం, గీసుకొండ మండలాల్లో, మంత్రులతోపాటు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీకి నెక్కొండలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు రావుల హరీశ్‌రెడ్డి, నరుకుడు వెంకటయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడి రాజిరెడ్డి, తదితరులు మాట్లాడారు. అలాగే సంగెం, గీసుకొండ మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లను కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, తదితరులు వీక్షించారు.



నెక్కొండలో..



సంగెంలో..



గీసుకొండ : వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న మేయర్ సుధారాణి, తదితరులు

'రైతుబంధు' ఎగ్గొట్టి సంబరాలు

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు

దుగ్గొండి : రైతుబంధు ఎగ్గొట్టి రైతుభరోసా నిధులు అందజేసి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గిర్నిబావిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి ఒకసారి ఎగ్గొటారని, రెండోసారి రూ.12 వేలకు పరిమితం చేశారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ సైతం కేవలం 52 శాతం మంది రైతులకే వర్తించిందని, మిగతా 48 శాతం మంది రైతులను మోసం చేశారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే ప్రభుత్వం రైతుభరోసా నిధులు విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ మోసపూరిత విధానాలపై రైతులు చైతన్యవంతం కావాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, నాయకులు కాట్ల భద్రయ్య, కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, శానబోయిన రాజ్‌కుమార్, రంగారావు రజినీకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

రోడ్డుపై బైఠాయించి నిరసన



వర్ధన్నపేట : కుటుంబ భూతగాదాల విషయంలో తనకు న్యాయం జరగడం లేదంటూ మండలంలోని కట్ర్యాలకు చెందిన కట్ట రాజు పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపాడు. తన తండ్రితో ఉన్న భూతగాదా విషయంలో తనపై దాడి చేయగా తాను పోలీసులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నాడు. తన తండ్రితో పోలీసులు కుమ్మక్కై తన ఫిర్యాదును పక్కన పెట్టి బాధితుడైన తన మీదే అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించి తన ఫిర్యాదుపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరాడు.

మాదకద్రవ్యాల బారిన పడొద్దు

- సీఐ మహేందర్

గీసుకొండ : విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడొద్దని సీఐ మహేందర్ కోరారు. వంచనగిరిలోని మోడల్ స్కూల్/కాలేజీలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గంజాయి, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్, ధూమపానం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కెరీర్‌పై దృష్టి సారించాలని చెప్పారు. క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జాగృతి పోలీస్ కళాబృందం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఎస్సై ప్రశాంత్, ఇన్‌చార్జ్ ఏఎస్సై నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మహేందర్

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

రాయపర్తి : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని కొత్తూరుకు చెందిన చెట్టి దేవరాజు (31) ఈనెల 22న మద్యం మత్తులో ఇంటిపైకెక్కి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..

పర్వతగిరి : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చింతనెక్కొండ క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లికి చెందిన ఆరెల్లి రోహిత్ (26) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చింతనెక్కొండ క్రాస్ రోడ్డు సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడిపోయింది. దీంతో రోహిత్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి



నర్సంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ



ఖానాపురం : నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

- హౌసింగ్ ఏఈ భవ్యశ్రీ

నర్సంపేట : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని హౌసింగ్ ఏఈ భవ్యశ్రీ కోరారు. చెన్నారావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఇళ్లను 400–600 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాత్రమే చేపట్టాలని, నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. బెడ్ లెవల్‌లో పనులు పూర్తి చేస్తే లబ్ధిదారుల ఖాతాలో లక్ష రూపాయలు ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. సదస్సులో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య గౌడ్, మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేశ్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరె కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ ధోని కమలమ్మ, జీపీ కార్యదర్శి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వేగం పెంచండి

ఖానాపురం : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని నాజీతండాలో ఇళ్ల నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. నిర్మాణ పనుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సహకారాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి బాలు, తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయంతో ఉపాధి పెంపు

- రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్

సంగెం : నూతన శాస్త్ర, సాంకేతికతతో కూడిన లాభసాటి వ్యవసాయం ద్వారానే ఉపాధి పెరుగుతుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన షార్ట్ ఫిలింను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. రైతులను చైతన్యవంతం చేసి వారి హక్కులను కాపాడే దిశగా షార్ట్ ఫిలిం నిర్మించినట్టు తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా జనాభాలో 70 శాతానికిపైగా ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, జిల్లా కమిటీ సభ్యుడు పోలబోయిన పైడి, నాయకులు పెండ్లి శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, కొమురయ్య, రమేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ కరువు

నర్సంపేట రూరల్ : మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ కరువైంది. మెనూ ఒకలాగా, వర్కర్లు అందిస్తున్న భోజనం, కూరలు మరోలా ఉంటున్న దుస్థితి నెలకొంది. వివరాలిలా.. నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు మంగళవారం ఉదయం రాగి జావ అందించారు. మధ్యాహ్న భోజనంలో సాంబారు, వెజిటెబుల్ కర్రీ అందించాల్సి ఉండగా పప్పుతోపాటు దోసకాయ కూర నీళ్లను తలపించేలా చేసి, సాంబారు చేయడాన్ని విస్మరించారు. నీళ్ల లాంటి కూరతోనే భోజనం వడ్డించారు. కూరలు సరిగా లేకపోవడంతో పిల్లలు భోజనం చేయడంలో ఇబ్బంది పడుతున్నారు.

పుస్తక పఠనంతో నైపుణ్యాల పెంపు

- 'లీడ్' వ్యవస్థాపకుడు రవికుమార్

నర్సంపేట : పుస్తక పఠనంతో సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయని లీడ్ గ్రంథాలయ వ్యవస్థాపకుడు, గ్రంథాలయ ఉద్యమకర్త కాసుల రవికుమార్ తెలిపారు. పట్టణంలోని లీడ్ లైబ్రరీలో రీడర్స్ క్లబ్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పుస్తక ప్రియుల కోసం పట్టణంలోని లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో 'హగ్ ఏ బుక్' రీడర్స్ క్లబ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పిల్లలు, పెద్దల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడం ద్వారా భాషా నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను అభివృద్ధి చేయొచ్చని తెలిపారు. సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహకం లభిస్తుందన్నారు. సమూహ చర్చలు, అనుభవాలు పంచుకోవడం ద్వారా సామాజిక నైపుణ్యాల మెరుగుదల లక్ష్యాలుగా క్లబ్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. పుస్తక ప్రియులు క్లబ్‌లో చేరాలని, పఠనాన్ని లవర్చుకోవాలని కోరారు. ప్రతినెలా రెండో, నాల్గో శనివారాల్లో నూతన పుస్తకాల పరిచయం, రచయితలతో సమావేశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రధాన నిర్వాహకురాలు శోభారాణి, మాజీ ఎంపీపీ ఓంప్రకాశ్, ఉపాధ్యాయుడు నందగోపాల్, గీతాంజలి స్కూల్ డైరెక్టర్ కిరణ్, శ్రీనివాస్, హరి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవికుమార్, తదితరులు

పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలోని కార్ల్ మార్క్స్ కాలనీలో బైరబోయిన నర్సయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి రమేశ్ హాజరై మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు గడచినా పేదల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సొంతిల్లు, భూమి లేని పేదలు ఎన్నికల హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల సందర్భంగా హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక విస్మరించడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను గుర్తించి భూపోరాటాలను కొనసాగించేందుకు సిద్ధం కావాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో యూపీఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, పార్టీ శాఖ కార్యదర్శులు జన్ను జమున, గజవెల్లి జగపతి, చొప్పరి పద్మ సదానందం, గణిపాక బిందు, నకినబోయిన భవానీ, వెన్నెల భారతి, జ్యోతి, రతన్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

కమిటీ ఎన్నిక

రాయపర్తి : నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాయపర్తి గ్రామ కమిటీని మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనగందుల సదానందం, ఉపాధ్యక్షుడిగా ఎనగందుల విష్ణు, కోశాధికారి శ్రీను, సలహాదార్లుగా లింగయ్య, వర్దయ్య, యాదగిరి, మహేందర్, యాకయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎనగందుల ప్రవీణ్, రత్నాకర్, కుమార్, మల్లయ్య, మహేందర్, సతీశ్, వెంకటయ్య, సందీప్, మహేశ్, హరీశ్, సంపత్, సదానందం, మల్లయ్య, రాజు, మహేశ్, మధు ఎన్నికయ్యారు.

బాధిత మహిళలకు సేవలే లక్ష్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వప్న, హర్షిత, తదితరులు

- కేస్ వర్కర్ స్వప్న, జెండర్ స్పెషలిస్ట్ హర్షిత

ఖానాపురం : సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కేస్ వర్కర్ స్వప్న, వుమెన్ హబ్ జెండర్ స్పెషలిస్ట్ హర్షిత తెలిపారు. మండలంలోని కొత్తూరు, ఖానాపురం గ్రామాల్లో సఖి సెంటర్లలో అందుతున్న సేవలపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గృహహింస, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు 181కు, వృద్ధులు టోల్ ఫ్రీ నంబర్ 14567కు, బాలలు 1098కు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. అనంతరం సఖీ సేవలపై అవగాహన కల్పించేలా ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీసీ కరుణ, వీఏఓ వెంకటమ్మ, శారద, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు పాల్పడితే చర్యలు

నెక్కొండ : మండలంలోని సర్వే నంబర్ 707లోని చంద్రుగొండ చెరువు శిఖం భూమి కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. చెరువు శిఖం వద్ద మూడుతండా గిరిజనులు మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టగా తహసీల్దార్ హాజరై పరిశీలించారు. చంద్రుగొండ, బంజరుపల్లి, గేటుపల్లి, ఏనుగల్లు శివారు తండావాసులు సుమారు 50 ఎకరాల భూమిని కబ్జాకు పాల్పడుతున్నారన్న ఆరోపణపై విచారణ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. కబ్జాకు పాల్పడితే పట్టా పాసుపుస్తకాలను రద్దు చేస్తామని ఆందోళనకారులకు హామీ ఇచ్చి శాంతింపజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేందర్, సర్వేయర్ కుషల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి



నర్సంపేట రూరల్ : మహిళా సంఘాలను గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని ఐకేపీ ఏపీఎం మహేందర్ కోరారు. నర్సంపేట మండలంలోని ఆదర్శ మండల సమాఖ్యలో మండల గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. సంఘాలకు పుస్తక నిర్వాహణ, సమావేశాల ఏర్పాటు, లింకేజీ రుణాలు, పొదుపు చెల్లించడం తదితరాలపై అవగాహన కల్పించారు.

నివాళి

ఖానాపురం : మండలంలోని కొత్తూరుకు చెందిన మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు వేములపల్లి వెంకట ప్రసాదరావు, భానుప్రసాద్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- డీపీఎం దయాకర్

పర్వతగిరి : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీపీఎం దయాకర్ ఆకాంక్షించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మదర్ థెరిస్సా మండల సమాఖ్య 19వ వార్షిక మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించేలా బ్యాంకు లింకేజీ రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతినెలా సమావేశాలు ఏర్పాటు చేసుకుని రికార్డులను సరిచూసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏపీఎంలు వేణుగోపాల్‌రావు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్